RNI-TELTEL/2017/72695

29 డిసెంబర్ 2022

శుభ తెలంగాణ

గురువారం | మేడ్చల్

సంపుటి : 5, సంచిక :299

ఎడిటర్: ఎన్ సీ శేఖర్

వెల: 4 రూ/.

Website: www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

# మా టెక్స్‌టైల్‌కు శక్తినివ్వండి

## కేంద్రానికి మంత్రి కేటీఆర్ లేఖ

- మౌలిక వసతుల్లో బంగ్లాదేశ్, లంక కంటే వెనుకే
- ఇలా అయితే మేక్ ఇన్ ఇండియా పరిస్థితేంటి?
- మేం సొంతంగానే నేతన్నకు గొప్ప శక్తినిస్తున్నాం
- రాష్ట్రం చేసినప్పుడు కేంద్రం ఎందుకు చేయలేదు?
- వచ్చే బడ్జెటే మోదీ సర్కారుకు చివరి పూర్తి బడ్జెట్
- అందులోనైనా టెక్స్‌టైల్ రంగానికి ఊతమివ్వండి
- కేఎంటీపీకి 900 కోట్లు రూపాయలు ఇవ్వండి
- సిరిసిల్ల పవర్‌లూంకు 100 కోట్లు కేటాయించండి
- ఐఐహెచ్‌టీ, ఎన్‌టీఆర్ఐ, హెచ్ఈపీసీ ప్రకటించండి
- కేంద్రప్రభుత్వానికి మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** తెలంగాణ నేతన్నల సంక్షేమం, అభివృద్ధి కోసం రానున్న కేంద్ర బడ్జెట్‌లో అయినా తగినన్ని నిధులు కేటాయించాలని రాష్ట్ర జౌళి శాఖ మంత్రి కే తారకరామారావు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కోరారు. గత ఎనిమిదేండ్లలో రాష్ట్రాన్ని కేంద్రం ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. మోదీ సర్కారుకు ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్ అని, వచ్చే ఏడాది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే ఉంటుందని గుర్తుచేసిన కేటీఆర్, ఇప్పటికైనా తెలంగాణ పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. రానున్న బడ్జెట్‌లో టెక్స్‌టైల్ రంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి కేటీఆర్ ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు.

**మంత్రులు మారినా తీరు మారలే..**

కేంద్రంలో మంత్రులు మారినా తెలంగాణకు నిధులు ఇచ్చే విషయంలో కేంద్రం తీరు మాత్రం మారలేదని మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ టెక్స్‌టైల్ రంగానికి నిధులు కేటాయించాలని ఎన్నిసార్లు విన్నవించినా కేంద్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. గత ఎనిమిదేండ్లుగా కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా అందిన ప్రోత్సాహమేదీ లేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నేతన్నల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. 'భారతదేశ టెక్స్‌టైల్ రంగం వేగంగా అభివృద్ధి చెందాలంటే భారీగా మౌలిక వసతుల కల్పన అవసరం. దీన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, దేశంలోనే అతిపెద్ద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటుచేస్తున్నది. ఇందులో జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయి. దేశీయ టెక్స్‌టైల్ రంగంలో ఈ పారుకు ఉన్న ప్రాధన్యతను కేంద్రం గుర్తించాలి. ఈ మెగా టెక్స్‌టైల్ పార్కులో మౌలిక వసతుల కల్పన కోసం నిధులివ్వాలని కేం ద్రాన్ని అనేకసార్లు అభ్యర్థించినా ఒక రూపాయి కూడా ఇవ్వ లేదు. సుమారు రూ.1,600 కోట్లతో చేపట్టిన ఈ భారీ టెక్స్ టైల్ పార్కుకు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద నిధులు మంజూరు చేసేందుకు అవకాశం

-మిగతా 2లో



# సీఎం ప్రజలకు చెప్పడాన్ని తప్పుబట్టలేం

## ఎమ్మెల్యేల కొనుగోలు యత్నం నేరం

### సిట్‌పై తీర్పుకాపీలో హైకోర్టు వ్యాఖ్యలు

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ఎమ్మెల్యేల కొనుగోలు ప్రయత్నాలు తీవ్రమైనవని, తీవ్ర నేరాభి యోగమని రాష్ట్ర హైకోర్టు తేల్చి చెప్పింది. ఎమ్మెల్యేల ఎర కేసు దర్యాప్తును సిట్ నుంచి సీబీఐకి ఇవ్వాలని బీజేపీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ, నిందితుల పిటిషన్లను విచారణకు అనుమతిస్తూ న్యాయమూర్తి జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం వెలువరించిన 98 పేజీల తీర్పు సర్టిఫైడ్ కాపీ బుధవారం అందుబాటులోకి వచ్చింది. ఎమ్మెల్యేల కొనుగోలు కుట్రను ప్రజలకు సీఎం కేసీఆర్

-మిగతా 2లో

# తెలంగాణ డిస్కమ్‌ల నుంచి 6వేల కోట్లు ఇప్పించండి



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** 8 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యలను పరిష్కరించాలని ప్రధాని మోడీని సీఎం జగన్ అభ్యర్థించారు. టీఎస్ డిస్కమ్‌లు తమ రాష్ట్రానికి బకాయి పడిన రూ.6,886 కోట్లను వెంటనే ఏపీ జెన్‌కోకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పునర్వ్యవస్థీకరణ తర్వాత ఏపీ జిల్లాల సంఖ్య 26కు పెరిగిందని,

-మిగతా 2లో


# ఫార్మా సిటీని రద్దు చేయాలి




**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ప్రభుత్వం వెంటనే ఫార్మా సిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బాధిత రైతులు పాదయాత్రను నిర్వహి స్తున్నారు. ఈ నిరసన కార్యక్రమం ఫార్మా సిటీ ప్రతిపాదిత గ్రామం మేడిపల్లి నుంచి ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం

వివరాలు 2లో..


# కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతో అనుమానాలు



- రాజ్యాంగ వ్యవస్థలపై విశ్వాసం
- ఎమ్మెల్యేల కొనుగోలుకు ఎర కేసులో ఆరోపణలను హైకోర్టు కొట్టివేయలేదు
- కనీస అవగాహనలేని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- తప్పు చేసిన వాళ్లకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు
- మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

-మిగతా 2లో

# కవిత్వపు 'మణి' కన్నుమూత



- అనారోగ్యంతో రాజేశ్వరి మృతి
- నేత కుటుంబంలో కవితాసుమం
- చేతులు లేకున్నా కాళ్లతో రచన
- సంతాపం తెలిపిన మంత్రి కేటీఆర్

-మిగతా 2లో

# చంద్రబాబు రోడ్‌షో.. 8 మంది మృతి

## తొక్కిసలాటతో ప్రమాదం, పలువురికి గాయాలు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లా కందు కూరులో విషా దం చోటుచేసుకొన్నది. తెలుగుదేశం పార్టీ అధ్యక్షు డు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన

-మిగతా 2లో

# ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని పరామర్శించిన ప్రధాని మోదీ



- అస్వస్థతకు గురైన మోదీ మాతృమూర్తి హీరాబెన్
- అహ్మదాబాద్ ఆసుపత్రిలో చికిత్స
- అహ్మదాబాద్ చేరుకున్న మోదీ
- డాక్టర్లను అడిగి తల్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న వైనం

-మిగతా 2లో

# నేడు ముచ్చింతల్‌కు రాష్ట్రపతి



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** శీతాకాలం విడిది కోసం రాష్ట్రానికి విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగా ణలోని పలు ప్రాంతాలను సందరి ్శస్తున్నారు. బుధవా రం భద్రాద్రి, రామప్ప ఆలయాలను ఆమె

-మిగతా 2లో

# మేడారం జాతర విలువల కాణాచి



- రామప్ప శిల్ప సంపద అద్భుతం
- భద్రాద్రి, రామప్పలో ప్రసాద్ పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపదీముర్ము
- వర్చువల్ విధానంలో ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభం

-మిగతా 2లో

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెం దిన సమ్మక్క సారలమ్మ వంటి జాతరలు సమాజంలో విలువలు పెంపొందింపజేయడానికి దోహదపడతాయని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పేర్కొన్నారు. రామప్ప ఆలయంలో శిల్పసంపద అద్భుతమని కొనియాడారు. శీతకాల

# టెన్త్‌లో 6 పేపర్లే..

## ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు



- పదో తరగతి పరీక్షల వివరాలు తెలిపిన విద్యాశాఖ మంత్రి
- వంద శాతం సిలబస్‌తో పరీక్షలు జరుపుతున్నామన్న సబిత
- 6 పేపర్లతో పరీక్షలు
- ప్రతి పేపర్ కు 3 గంటల సమయం
- సైన్స్ పేపర్ కు 3 గంటల 20 నిమిషాల సమయం

-మిగతా 2లో

## తెలంగాణ డిస్కమ్‌ల నుంచి 6వేల కోట్లు ఇప్పించండి

-మొదటి పేజి తరువాయి

ప్రజల వైద్య అవసరాలను తీర్చడానికి ప్రస్తుతం 12 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి మరో 14 మెడికల్ కాలేజీలను మంజూరు చేయాలని జగన్ ప్రధానిని కోరినట్లు ఏపీ సీఎంఓ ప్రకటించింది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో చర్చించినట్లు సీఎం జగన్ ట్వీట్ చేశారు. రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలని, ప్రత్యేక హోదాతో పాటు పలు పెండింగ్ అంశాలను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. తమ విజ్ఞప్తిపై పీఎం మోడీ సానుకూలంగా స్పందించారని అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి ఏపీ సీఎం జగన్ ఢిల్లీకి వెళ్లారు. మధ్యాహ్నం ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అనంతరం కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో ఆయన సమావేశమయ్యారు.

## టెన్త్‌లో 6 పేపర్లే..

హైదరాబాద్, : పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వం భారీ సంస్కరణలు తీసుకువచ్చింది. ఈ విద్యాసంవత్సరం నుంచి 11 పేపర్లను కుదించి, 6 పేపర్లకే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఒక్కో సబ్జెక్టులో 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. మిగతా 20 మార్కుల్ని ఫార్మెటివ్ అసెసెమెంట్‌కు ఇచ్చారు. 9వ తరగతి విద్యార్థులకు కూడా ఇదే విధానం వర్తిస్తుంది. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ జీవో 33 జారీ చేశారు. ఇదివరకు వ్యాసరూప, సూక్ష్మరూప ప్రశ్నలు రెండింటిలోనూ విద్యార్థులకు చాయిస్ ఇచ్చేవారు. కానీఇప్పుడు వ్యాసరూప ప్రశ్నల్లోనే చాయిస్ ఉంటుంది. సూక్ష్మ రూప ప్రశ్నలకు చాయిస్ వర్తించదు. మరోవైపు పదో తరగతి పరీక్షల షెడ్యూల్ కూడా విద్యాశాఖ ఖరారు చేసింది. పరీక్షలు వచ్చే ఏడాది ఏప్రిల్ 3న ప్రారంభమై, 13న ముగుస్తాయని తెలిపింది. పదోతరగతి పరీక్షల షెడ్యూల్ రూపకల్పనపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి బుధవారం సమీక్షను నిర్వహించారు. ఈ ఏడాది నుంచి 100 శాతం సిలబస్‌తో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. గతంలో కరోనా ప్రభావంతో గత రెండేండ్లు 70శాతం సిలబస్‌కే పరీక్షలు నిర్వహించామని గుర్తుచేశారు. పరీక్షల దృష్ట్యా సెలవు రోజుల్లో కూడా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా సబ్జెక్టుల్లో వెనుకబడి ఉంటే వారికి ప్రత్యేకంగా బోధించాలని తెలిపారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు బడులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి , మార్చి మాసాల్లో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు వివరించారు. సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

**మాడల్ పేపర్లు విడుదల**

పదో తరగతి పేపర్లను 6 పేపర్లకు కుదించిన నేపథ్యంలో మాడల్ పేపర్లను ఎస్సీఈఆర్టీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్టు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి తెలిపారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన మాడల్ పేపర్లను అందుబాటులో ఉంచామని చెప్పారు.

**సైన్స్‌లో రెండు పేపర్లు**

సైన్స్ సబ్జెక్టులో భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పేపర్లకు 40 మార్కుల చొప్పున ఒకేరోజు పరీక్ష నిర్వహిస్తారు. సైన్స్ పేపర్‌కు పరీక్షా సమయం 3 : 20 నిమిషాలు కాగా, మిగతా సబ్జెక్టులకు 3 గంటల సమయం కేటాయించారు.

## కవిత్వపు 'మణి' కన్నుమూత

సిరిసిల్ల నేతన్న చౌరస్తా, డిసెంబర్ 28: 'మనసన్నదే లేదు ఆ బ్రహ్మకు.. ఎదురీత రాశాడు నా జన్మకు.. రూపంలేని దేవుడు నా రూపాన్ని ఎందుకిలా మలిచాడు' ఇది రాజేశ్వరి మనోగతం. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన బూర రాజేశ్వరి (42) మాటలు సరిగా రాకపోయినా, చేతులతో రాయలేకపోయినా తన కాళ్లనే చేతులుగా మలుచుకొని అక్షరాలను కవిత్వం రూపంలో ఎక్కుపెట్టింది. బూర అనసూర్య-సాంబయ్య కూతురు రాజేశ్వరి. పుట్టుకతోనే దివ్యాంగురాలైన ఆమె కాళ్లతో ఎన్నో కవితలు రాసింది. ఆమె కవితలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. నడవలేని స్థితిలో కూడా మంచానికే పరిమితమై.. తన భావాలను, మనసులో ఉన్న బాధలను కవితల రూపంలో మలిచింది. 500కుపైగా కవితలు రాసి ఈ లోకాన్ని ఆకర్షించింది.

**నాడు వెతుక్కుంటూ వచ్చిన సుద్దాల**

ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ పాటలంటే తనకు ఇష్టమని ఇంటర్వ్యూలో రాజేశ్వరి చెప్పింది. ఇది విన్న ఆయన రాజేశ్వరిని వెతుక్కుంటూ సిరిసిల్లకు వచ్చి, ఆమె కాలి వేళ్లతో రాసిన కవిత్వాన్ని చూసి ఆశ్చర్యపోయారు. రాజేశ్వరికి ఉజ్వల భవిష్యత్ ఉన్నదంటూ సుద్దాల హన్మంతు-జానకమ్మ రాష్ట్రస్థాయి అవార్డు అందించారు. కవిత్వంలో ఆమె చేస్తున్న ప్రయోగాలు సాహితీవేత్తలను సైతం ఆకట్టుకున్నాయి.

**అండగా నిలిచిన ప్రభుత్వం**

రాజేశ్వరి ప్రతిభను మెచ్చిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆమె పేరుమీద ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ప్రతి నెలా రూ.7 వేల వడ్డీతోపాటు రూ.3 వేల పెన్షన్ వస్తున్నది. రాజేశ్వరి ఉండేందుకు మండెపల్లి కేసీఆర్ కాలనీలో డబుల్‌బెడ్రూం ఇల్లు కేటాయించారు. ఆమె అక్కడే ఉంటున్నది. మంత్రి కేటీఆర్ అన్నిరకాలుగా అండగా నిలిచినా ఫలితం లేకపోయింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం మధ్యాహ్నం మరణించింది.

## మేడారం జాతర విలువల కాణాచి

-మొదటి పేజి తరువాయి

విడిది కోసం హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి బుధవారం రాష్ట్రంలో పలు కార్యక్రమా ల్లో పాల్గొన్నారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంతోపాటు ములుగు రామప్ప దేవాలయంలో కేంద్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలోని ప్రసాద్ పథకాన్ని ప్రారంభించారు. భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమ్మక్క సారలమ్మ పూజారుల సమ్మేళనంలో పాల్గొన్నారు. అంతకుముందు వర్చువల్ విధానంలో ఆసిఫాబాద్, మహబూబాబాద్‌లో ప్రభుత్వం నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్రపతి మాట్లాడుతూ.. రాష్ట్రపతి హోదాలో తెలంగాణలో తొ లిసారిగా పర్యటిస్తున్నానని, ఇక్కడి ప్రముఖ్య పుణ్యక్షేత్రాల్లో దేశ సంక్షేమం కోసం ప్రార్థించే అవకాశం లభించిందని చెప్పారు. ప్రసాద్ పథ కం ఆలయాల జీర్ణోద్ధరణ, అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. తెలంగాణ వనవాసీ పరిషత్ గిరిజన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు పాటుపడటం హర్షణీయమని పేర్కొన్నారు. ఏకలవ్య మాడల్ స్కూల్స్ ద్వారా ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య అందుతున్నదని ప్రశంసించారు.

## ఫార్మా సిటీని రద్దు చేయాలి

-మొదటి పేజి తరువాయి

జరుగుతుంది. మంగళవారం ప్రారంభమైన ఈ పాదయాత్ర ఇవాళ ఇబ్రహీంపట్నం చేరుకుంది. ఇక్కడ పాదయాత్ర ప్రారంభం కాగానే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వచ్చి రైతులకు సంఘీభావం తెలిపారు. రైతులతో కలిసి కొంత దూరం ఆయన నడిచారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజల భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి కోట్ల రూపాయలకు ఫార్మా కంపెనీలకు అమ్ముకుంటోందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. గతంలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేసిన చోట కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ఒకే చోట వందల కంపెనీలు ఏర్పాటు చేస్తే.. హైదరాబాద్ చుట్టుపక్కల ఎవరూ ఉండలేరని తెలిపారు. పార్టీలకతీతంగా పోరాటం చేయాలని సూచించారు.

# మా టెక్స్‌టైల్‌కు శక్తినివ్వండి

-మొదటి పేజి తరువాయి

ఉన్నది. ఇందులో మౌలిక వసతుల కల్పన, ఇతర కార్యక్రమాల కోసం ఈసారి బడ్జెట్‌లో కనీసం రూ.900 కోట్లు కేటాయించాలి' అని కోరారు.

**తెలంగాణకు ఐఐహెచ్‌టీ ఇవ్వాలి**

రాష్ట్రంలో పవర్‌లూం పరిశ్రమతోపాటు చేనేత పరిశ్రమకు కూడా అత్యంత ప్రాధాన్యం ఉన్నదని, సుమారు 40 వేల చేనేత కార్మికులు పని చేస్తున్నారని మంత్రి కేటీఆర్ తెలిపారు. యాదాద్రి భువనగిరి, గద్వాల, వరంగల్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో చేనేత కార్మికులు ఎకువగా ఉన్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) సంస్థను మంజూరు చేయాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేనేత కళపై డిప్లొమా చేసేందుకు ఇకడి విద్యార్థులకు అవకాశం లేదని, వీరంతా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలకు వెళ్లి శిక్షణ పొందుతున్నారని గుర్తుచేశారు. ఐఐహెచ్‌టీని కేటాయిస్తే ఇక్కడి విద్యార్థులకు అనుకూలంగా ఉండటంతోపాటు చేనేత పరిశ్రమ కూడా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇందుకోసం మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లాలో స్థలం కూడా అందుబాటులో ఉన్నదని గుర్తుచేశారు. తెలంగాణకు నేషనల్ టెక్స్‌టైల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌టీఆర్‌ఐ), హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (హెచ్‌ఈపీసీ)ను వచ్చే బడ్జెట్‌లో ప్రకటించాలని కోరారు. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ద్వారా బ్లాక్ లెవెల్ హ్యాండ్లూమ్ క్లస్టర్లను మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు.

**కేంద్రానిది ప్రగతి నిరోధక పాత్ర**

టెక్స్‌టైల్ రంగంలో తనదైన ముద్ర వేస్తున్న తెలంగాణకు ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. టెక్స్‌టైల్ రంగాన్ని కాపాడుకొంటున్న తెలంగాణ లాంటి రాష్ట్రాల పట్ల కేంద్రం ప్రగతి నిరోధక పాత్ర పోషిస్తున్నదని గత బడ్జెట్ కేటాయింపులను చూస్తే అర్థమవుతుందని విమర్శించారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణ టెక్స్‌టైల్ రంగానికి భారీగా నిధులు కేటాయించి నేతన్నలపట్ల నిబద్ధత చాటుకోవాలని సూచించారు. గత ఏడు సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న చేనేత, టెక్స్ టైల్ విధానాలను పునర్ సమీక్షించుకోవాలని కేటీఆర్ కోరారు. 'కేంద్రం రద్దు చేసిన నేత కార్మికుల పొదుపు పథకం, ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, పవర్ లూం, హాండీక్రాఫ్ట్ బోర్డులను తిరిగి ఏర్పాటు చెయ్యాలి. వర్ కం ఓనర్ షెడ్ పథకాన్ని పునరుద్ధరించి నేత కార్మికులు తమ కాళ్లపై తాము నిలబడేలా సహకారం అందించాలి. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నట్టుగా యార్న్ సబ్సిడీని కనీసం 50 శాతానికి పెంచాలి. మారెటింగ్ ఆధారిత ఇన్సెంటివ్ పథకాన్ని సరళతరం చేసి నేతన్నలకు అండగా నిలబడేలా బడ్జెట్‌లో నిర్ణయాలు తీసుకోవాలి. నేత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచే బీమా యోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాలి' కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

**జీఎస్టీని ఉపసంహరించాలి**

చేనేత ఉత్పత్తులపై ప్రతిపాదించిన జీఎస్టీని ఉపసంహరించుకోవాలని మంత్రి కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. 'గ్రామీణ ఆధారిత ఉపాధి అవకాశాలు కల్పించి, దేశ వారసత్వ చరిత్రను ప్రపంచ పటంపై ఘనంగా ఆవిష్కరించే చేనేతను కేవలం ఒక పరిశ్రమగా కాకుండా దేశ సంస్కృతి, సంప్రదాయంగా చూడాలి. గాంధీ మహాత్ముని ఆలోచనల మేరకు చేనేత రంగానికి పూర్తి పన్ను మినహాయింపు ఇవ్వాలి. దేశంలో వ్యవసాయం తరువాత అత్యధిక మందికి ఉపాధి కల్పించే టెక్స్‌టైల్, చేనేత రంగానికి అదనపు ప్రయోజనాలు, ప్రోత్సాహకాలు కల్పించి ఆదుకోవాలి. ఈ దిశగా పరిశ్రమ వర్గాలు, నేతన్నలతో వెంటనే కేంద్రం సంప్రదింపులు జరపాలి. దేశంలో హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ పరిశ్రమ సుమారు 80 శాతం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా యూనిట్లుగానే ఉన్నది. అధిక పన్నుల భారంతో ఇప్పటికే ఎంఎస్‌ఎంఈల మనుగడ కష్టంగా మారింది. ఈ విషయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరించి, పరిశ్రమకు బడ్జెట్‌లో ప్రోత్సాహక చర్యలు ప్రకటించాలి. ప్రస్తుతమున్న రూ.20 లక్షల జీఎస్టీ స్లాబ్‌ను చేనేత, పవర్‌లూం కార్మికులకు రూ.50 లక్షలకు పెంచాలి' అని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు.

**ప్రోత్సాహకాలు లేనందునే బంగ్లాదేశ్, శ్రీలంక కన్నా వెనుకబాటు**

కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించకపోవటం, పాలసీ ప్రోత్సాహకాలు లేకపోవడం వంటి కారణాల వల్లే టెక్స్‌టైల్ రంగంలో బంగ్లాదేశ్, శ్రీలంక వంటి చిన్న దేశాలకంటే మనదేశం వెనుకబడిందని మంత్రి కేటీఆర్ అన్నారు. చిన్న దేశాలతో పోటీ పడేందుకు కూడా కేంద్రానికి ఎనిమిదేండ్ల కాలం సరిపోలేదా? అని ప్రశ్నించారు. 'అంతర్జాతీయంగా గొప్ప పేరున్న కిటెక్స్ సంస్థ దేశాన్ని వదిలిపెట్టేందుకు సిద్ధపడింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులాంటి మౌలిక వసతులు, పాలసీ ప్రోత్సాహకాల వల్ల చివరిక్షణంలో దేశంలోనే ఉండిపోవాలని నిర్ణయించిన మాట వాస్తవం. రాష్ట్రంగా ఏర్పడిన ఐదేండ్లలోనే తెలంగాణ రాష్ట్రం టెక్స్‌టైల్స్‌లో అంతర్జాతీయంగా పోటీపడేలా భారీ మౌలిక వసతుల కల్పిస్తే, బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేండ్లలో ఇలాంటి ప్రయత్నం ఒక్కటి కూడా చేయకపోవటం బాధాకరం. ఇలాంటి విధానాలతో కేంద్ర ప్రభుత్వం చెప్తున్న మేక్ ఇన్ ఇండియా అనేది ఒక నినాదంగా మాత్రమే మిగిలిపోతుంది. టెక్స్‌టైల్ రంగంలో అంతర్జాతీయ సంస్థలను మనదేశానికి రప్పించడంలో మోదీ సరారు పూర్తిగా విఫలమైంది' అని కేటీఆర్ విమర్శించారు.

**సిరిసిల్ల పవర్‌లూమ్ క్లస్టర్‌కు రూ.100 కోట్లు ఇవ్వండి**

నేతన్నలకు భవిష్యత్తుపైన భరోసా కల్పించేందుకు 'కాంప్రహెన్సివ్ పవర్‌లూమ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ సీం'లో భాగంగా సిరిసిల్లలో భారీ పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే పవర్‌లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. మెగా పవర్‌లూం క్లస్టర్‌కు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం వరర్ టు ఓనర్ సీం, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. 5 వేలకుపైగా పవర్‌లూమ్ మగ్గాలుంటే కేంద్ర ప్రభుత్వం నిధులు అందించాలని నిబంధనలు చెప్తున్నాయని, సిరిసిల్ల పవర్‌లూం క్లస్టర్‌లో 25 వేలకుపైగా పవర్‌లూం మగ్గాలున్నందున దీనిని మెగా పవర్‌లూం క్లస్టర్‌గా గుర్తించి కేంద్ర బడ్జెట్‌లో కనీసం రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. 'సిరిసిల్ల మరమగ్గాల ఆధునీకరణ, వ్యాల్యూ చైన్ బలోపేతం, మారెట్ అభివృద్ధి, నైపుణ్య అభివృద్ధి, కెపాసిటీ బిల్డింగ్, ప్రాజెక్ట్ మానిటరింగ్ వంటి పనుల కోసం సుమారు రూ.990 కోట్లు అవసరం. ఇందులో సింహభాగం మోదీ సర్కారు వచ్చే బడ్జెట్‌లో కేటాయించాలి. దీనితోపాటు ఇన్ సిటూ పవర్‌లూం అప్‌గ్రెడేషన్ కార్యక్రమం కింద మరో 13 వేల మరమగ్గాల అధునీకరణకు నిధులు కేటాయించాలి' అని విజ్ఞప్తిచేశారు.

# కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతో అనుమానాలు

**హైదరాబాద్,** : రాజ్యాంగ వ్యవస్థలపై తమకు అపారమైన విశ్వాసం ఉన్నదని, అయితే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతోనే వాటిపై అనుమానాలు కలుగుతున్నాయని పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ చెప్పారు. బాధ్యతాయుతమైన కేంద్రమంత్రి హోదాలో ఉండి కిషన్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం ఆయన బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేల కొనుగోలుకు ఎర కేసులో బీజేపీ నేతలు నార్కో అనాలిసిస్, లైడిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా? అంటూ మంత్రి కేటీఆర్ విసిరిన సవాల్‌పై కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూడున్నరేండ్లుగా సికింద్రాబాద్ నియోజకవర్గానికి కిషన్‌రెడ్డి ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌పై బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మండపడ్డారు.

**బీజేపీ నేతలు కోర్టుకు ఎందుకెళ్లారు?**

సిట్ విషయంలో కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు రాష్ట్ర పోలీసు వ్యవస్థ మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తలసాని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేల కొనుగోలుకు ఎర కేసును సీబీఐకి అప్పగించాలని హైకోర్టు చెప్పిందే కానీ, ఆరోపణలను కొట్టివేయలేదన్న కనీస అవగాహన కిషన్‌రెడ్డికి లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం వెలుగులోకి రాగానే ఆ కేసుతో బీజేపీకి ఏమి సంబంధమంటూ ప్రకటనలు చేసిన నాయకులు అనేక దశల్లో కోర్టుకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసును సీబీఐకి అప్పగించాలని కోర్టు తీర్పు ఇవ్వగానే బీజేపీ సంబురాలెందుకు చేసుకున్నదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను బట్టి ఈ కేసును బీజేపీ తమకు అనుకూలంగా మలచుకుంటుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు.

**అభివృద్ధిలో పోటీపడాలి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమం, ప్రజా ప్రయోజనాల కోసం పోటీపడాలే కానీ చిల్లర, దిగజారుడు రాజకీయాల్లో పోటీ పడొద్దని మంత్రి తలసాని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి హితవు చెప్పారు. కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేయడం తప్ప కేంద్రం నుంచి రాష్ట్రానికి పనికి వచ్చేది ఏదీ చేయలేదని ప్రజలే విమర్శిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రపంచ ప్రఖ్యాత నగరాల సరసన చేర్చిన ఘనత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌దేనని వివరించారు. దేశవ్యాప్తంగా సీఎం కేసీఆర్ పాలనపై ప్రశంసలు వస్తున్నా బీజేపీ నేతలకు కండ్లు కనిపించవు.. చెవులు వినిపించవని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, తప్పుచేసిన వాళ్లకు ప్రజాకోర్టులోనే శిక్ష పడుతుందని చెప్పారు. కేంద్రంలో బీజేపీకి అధికారం శాశ్వతం కాదనే విషయం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## చంద్రబాబు రోడ్‌షో.. 8 మంది మృతి

-మొదటి పేజి తరువాయి

బహిరంగ సభకు భారీగా కార్యకర్తలు రావడంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. కొందరు పక్కనే ఉన్న మురుగుకాల్వలో పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా ఇద్దరు మహిళలు సహా ఎనిమిది మంది మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఘటన జరిగిన వెంటనే చంద్రబాబు నాయుడు సభను అర్ధాంతరంగా నిలిపివేసి దవాఖానకు వెళ్లి బాధితులను పరామర్శించారు. జరిగిన సంఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. బాధితుల పిల్లలను ఎన్టీఆర్ ట్రస్టు విద్యాసంస్థల్లో ఉచితంగా చదివిస్తామని హామీ ఇచ్చారు.

## నేడు ముచ్చింతల్‌కు రాష్ట్రపతి

-మొదటి పేజి తరువాయి

సందర్శించారు. 29వ తేదీన (గురువారం) ముచ్చింతల్ లోని సమతా మూర్తిని ద్రౌపది ముర్ము వరకు సందర్శించనున్నారు. సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సాయంత్రం 5:15 గంటలకు చేరుకుంటారు. అనంతరం రాష్ట్రపతి కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గెస్ట్ హౌస్ కి చేరుకుంటారు. కాసేపు విశ్రాంతి తీసుకుని అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం గేట్ నెంబర్ 3 వద్దకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేరుకుంటారు. అక్కడ ఆమెకు చినజీయర్ స్వామి స్వాగతం పలుకుతారు.

108 దివ్య దేశాలు సందర్శిస్తూ.. ఆ తర్వాత రామానుజ స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ చూసి అక్కడి నుంచి రామానుజన స్వర్ణ విగ్రహాన్ని దర్శనం చేసుకుంటారు. అక్కడే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చిన జీయర్ స్వామి మంగళ శాసనాలు ఇస్తారు. ఆ తరువాత డైనమిక్ ఫౌంటైన్ షోను రాష్ట్రపతి తిలకించి, సందర్శకులని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తారు.

# సీఎం ప్రజలకు చెప్పడాన్ని తప్పుబట్టలేం

-మొదటి పేజి తరువాయి

వివరించటం అర్థం చేసుకోదగినదేనని తీర్పులో పేర్కొన్నది. ఎమ్మెల్యేల కొనుగోలు ప్రయత్నాలు, జరుగుతున్న సంఘటనల గురించి మీడియా ద్వారా ప్రజలకు చెప్పాలన్న ప్రయత్నాన్ని తప్పుపట్టలేమని స్పష్టం చేసింది. మీడియా సమావేశంలో ప్రధాని, కేంద్ర హోం మంత్రి పేర్లు సీఎం చెప్పినందున కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలన్న బీజేపీ వాదన సరికాదని తేల్చిచెప్పింది. కేసులోని కీలక సాక్ష్యాధారాలకు సంబంధించిన వీడియోలు లీక్ కావడం వల్ల సిట్ దర్యాప్తును సీబీఐకి బదిలీ చేస్తున్నామని తెలిపింది. జీవో 268 ప్రకారం ఏసీబీ పోలీసులు దర్యాప్తు చేయాల్సిన కేసు సాధారణ పోలీసులు దర్యాప్తు చేయడం చెల్లదని పేర్కొన్నది. అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే జీవో 63 ద్వారా ఏర్పాటైన సిట్‌ను రద్దు చేస్తున్నట్టు తీర్పులో ధర్మాసనం తెలిపింది.


**నేడు సిట్ అప్పీల్!**

సింగిల్ జడ్జి తీర్పు సర్టిఫైడ్ కాపీ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో సిట్ గురువారం ఆ తీర్పు అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ద్విసభ్య ధర్మాసనానికి అప్పీల్ చేయనున్నది. క్రిమినల్ కేసు దర్యాప్తు దశలో కోర్టులు అడ్డుకొనేందుకు ఆసాధారణ పరిస్థితులు ఉండాలని, ఈ కేసులో అలాంటిదేమీ లేదని సిట్ వాదించనున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరాలని నిందితులు బెదిరించారని, ఆ విధంగా చేయకపోతే ఈడీ,సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల నుంచి కేసుల విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా భయపెట్టినట్టు, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై ఈడీ తాజా కేసే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని తెలుపనున్నట్టు సమాచారం.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని పరామర్శించిన ప్రధాని మోదీ


**విజయవాడ :** ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తి హీరాబెన్ ఈ ఉదయం అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేరారు. అహ్మదాబాద్ లోని యూఎన్ మెహతా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆసుపత్రిలో హీరాబెన్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, ప్రధాని మోదీ అహ్మాబాద్ వచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని పరామర్శించారు. డాక్టర్లను అడిగి ఆమె ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. మోదీ రాక నేపథ్యంలో ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. కాగా, ప్రధాని మాతృమూర్తి ఆరోగ్యంపై ఆసుపత్రి వర్గాలు బులెటిన్ విడుదల చేశాయి. హీరాబెన్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వెల్లడించాయి. గత జూన్ లో హీరాబెన్ 100వ పుట్టినరోజు జరుపుకున్నారు.

# రేషన్ బియ్యం దందా...?






- క్వింటాల్ కు రూ.1000 నుండి రూ.1500 రూపాయల వరకు కొనుగోలు......
- ఇతర రాష్ట్రాలకు రూ.1800 నుండి రూ.2000 వరకు బేరం....
- దందాకు రెవెన్యూ పౌర సరఫరా, పోలీసు శాఖ అధికారులు పరోక్ష సహకారం....
- పాత రంగారెడ్డి జిల్లా, నల్గొండ లో రేషన్ బియ్యం దందా జోరు.....





హైదరాబాద్ డిసెంబర్ 28 (శుభ తెలంగాణ)

ఉమ్మడి రంగారెడ్డి అలాగే నల్గొండ జిల్లాలో జోరుగా సాగుతున్న రేషన్ బియ్యం దందా.దళారుల ద్వారా రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుండి సేకరిస్తున్న కొంతమంది రైస్ మిల్ వ్యాపారస్తులు . వివరాల్లోకి వెళితే దళారులు రూ.1,000 నుండి రూ.1,500 వరకు లబ్ధిదారులకు ఇచ్చి కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు అమ్మి వేస్తారు. తర్వాత రైస్ మిల్లర్లు ఇతర రాష్ట్రాలకు దర్జాగా క్వింటాల్ పై రూ.500 నుండి రూ.600 లాభాన్ని పట్టుకొని విక్రయిస్తున్నారు. అక్రమంగా బియ్యం ఇతర రాష్ట్రాలకు విక్రయించి లక్షల్లో లాభాల గడుస్తున్న దళారులు, రైస్ మిల్ వ్యాపారస్తులు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీని భరిస్తూ లబ్ధిదారులకు బియ్యం అందిస్తున్న నేపథ్యంలో ప్రజలు బాధ్యత వ్యవహరించి సద్వినియోగం చేసుకుంటే బాగుంటుంది కానీ రేషన్ బియ్యాన్ని అమ్ముకొని వారు మోసపోతు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ అక్రమార్కుల జేబులో నింపుతున్నారు.ఈ సబ్సిడీ మనం ప్రభుత్వానికి కట్టే పన్నుల ద్వారా వస్తుందన్న విషయం మరచిపోయి రేషన్ బియ్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు. ప్రతి నెల ఈ తంతు మామూలుగానే జరుగుతున్నప్పటికీ అత్యధికంగా రంగారెడ్డి, మేడ్చల్,హైదరాబాద్, మెదక్ సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా, వంటి జిల్లాల్లో అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా నుండి ఆంధ్రకు లారీల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నా సమాచారం ఉన్నప్పటికీ స్పందించని పౌర సరఫరా,పోలీసు శాఖ అధికారులు. అడపాదడపా నామమాత్రంగా పోలీసులు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ దళారుల లో ఎలాంటి మార్పు రాకపోవడం శోచనీయం ఇందులో అంతర్యామి ఏంటో ఇప్పటికైనా తెలియాల్సివుంది. ఇకనైనా అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

## శరీరంలో రోగ నిరోధక శక్తి పెరిగితేనే క్షయ వ్యాధి దూరం : మంత్రి నిరంజన్‌రెడ్డి

శరీరంలో రోగ నిరోధక శక్తి పెరిగితేనే క్షయ వ్యాధి దూరమవుతుందని, మాంసం తింటేనే బలం వస్తుందనే అపోహాలు మానుకుని కంది పప్పు, గుడ్డు, ఆకుకూరలలోనూ మాంసకృత్తులు ఉంటాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. వైద్యుల సూచనలు, జాగ్రత్తలు పాటిస్తే క్షయ వ్యాధి నయం అవుతుందన్నారు. వనపర్తిలోని పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం 42 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు తన సొంత డబ్బులతో నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరగాలంటే మంచి ఆహారం తీసుకోవాలన్నారు. క్షయ వ్యాధికి ఆరు నెలల చికిత్స సమయంలో వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి నయం అవుతుందని అన్నారు. క్షయ సోకిందని భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నిత్యావసరాల కిట్ లో నెలకు 5 కిలోల సన్నబియ్యం, 2 కిలోల మంచినూనె, ఒక కిలో కందిపప్పు, 30 గుడ్లను అందజేస్తున్నామని అన్నారు.




## సామాజిక సేవలో పారగాన్ సంస్థ సేవలు అభినందనీయం



**పటాన్ చెరు :** సామాజిక సేవలో పారగాన్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ మార్బ్ నగర్ లో పారగాన్ సంస్థ సౌజన్యంతో 83 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం నూతన భవనాల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే జీఎంఆర్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ లు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రభుత్వం అందించే నిధులతో పాటు పరిశ్రమలు సామాజిక బాధ్యతా కార్యక్రమం ద్వారా అందిస్తున్న నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. పారగాన్ సంస్థ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా ఇప్పటికే రామచంద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పటాన్చెరులోని ఏరియా ఆసుపత్రిలో లక్షల రూపాయల వ్యయంతో అధునాతన శస్త్ర చికిత్స పరికరాలను అందించిందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఆధునిక వసతులతో పాఠశాల భవనంతో పాటు అంగన్వాడి కేంద్రాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు.


## 13ఏళ్ల బాలిక అదృశ్యం.. మానసిక పరిస్థితి బాగోలేదని తల్లిదండ్రుల ఆందోళన



కవాడిగూడలో 13ఏళ్ల బాలిక అదృశ్యమైంది.కాగా ఆ బాలిక మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. బాలిక మిస్సింగ్ పై పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. బాలిక ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.నిన్న ఉదయం బయటకి వెళ్ళిన బాలిక అదృశ్యం ఘటన కలకలం రేపుతోంది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా బాలిక ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కవాడిగూడలో బాలిక ఆటో ఎక్కినట్టు గుర్తించారు. ఆటోను ట్రేస్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే స్నేహపురి కాలనీలో బాలిక ఫోన్ సిగ్నల్ ట్రేస్ చేశారు. సిగ్నల్స్ ఆధారంగా రెండు బృందాలుగా పోలీసులు గాలిస్తున్నారు.

## హైదరాబాద్ జేఎన్టీయూలో విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్ జేఎన్టీయూలో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. సీఎస్ఆర్ బిల్డింగ్ పై నుంచి దూకి విద్యార్థిని మేఘనారెడ్డి సూసైడ్ చేసుకుంది. విద్యార్థిని మేఘనారెడ్డి బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. అయితే విద్యార్థిని ఆత్మహత్యకు అనారోగ్య సమస్యలే కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



## త్వరలో హైకమాండ్‌కు డిగ్గీ రాజా నివేదిక.. రాష్ట్ర కాంగ్రెస్‌లో మార్పులే తరువాయి?



హైదరాబాద్ : గాడితప్పిన రాష్ట్ర కాంగ్రెస్ ను చక్కదిద్దే పనిలో పడింది ఆ పార్టీ అధిష్టానం. వచ్చే ఏడాది తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో.. గ్రూపులుగా విడిపోయిన నేతలను ఏకతాటి పైకి తెచ్చే పనిలో పడింది. కాంగ్రెస్ సీనియర్ నేత, ట్రబుల్ షూటర్ దిగ్విజయ్ సింగ్ రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించి నేతల అభిప్రాయాలను సేకరించారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితులపై ఓ అంచనాకు వచ్చిన ఆయన... హైకమాండ్ కు 1, 2 రోజుల్లో నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం.

**రాష్ట్ర కాంగ్రెస్ లో మార్పులు**

డిగ్గీ రాజా ఇచ్చే నివేదికతో రాష్ట్ర కాంగ్రెస్ లో మార్పులు, చేర్పులు ఉంటాయనే ప్రచారం పార్టీలో జోరుగా వినిపిస్తోంది. పీసీసీ చీఫ్ గా రేవంత్ ను కొనసాగిస్తూనే.. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా ఉన్న మాణిక్కం ఠాగూర్ ను తప్పిస్తారని చాలామంది నేతలు భావిస్తునారు. ఠాగూర్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా వచ్చి రెండేళ్లు దాటింది. ఈ రెండేళ్లలో జరిగిన ఉప ఎన్నికల్లో, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. పార్టీ బలోపేతం పక్కన పెడితే.. నేతల మధ్య సమన్వయం కుదర్చడంలో ఠాగూర్ విఫలమయ్యారనే టాక్ ఉంది. అలాగే నేతలు పార్టీ వీడకుండా చేయడంలో ఆయన ఫెయిల్ అయ్యారని కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు.

**మాణిక్కం ఠాగూర్ పై విమర్శలు**

పీసీసీ చీఫ్ గా రేవంత్ రెడ్డి ఎంపిక సమయంలో.. ఠాగూర్ పై చాలా విమర్శలు వచ్చాయి. సీనియర్లు ఆయనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ అభిప్రాయాలకు విలువ ఇవ్వరని, ప్రతి విషయంలో రేవంత్ ను ఠాగూర్ ఎంకరేజ్ చేస్తారని సీనియర్లు చాలా సార్లు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన దిగ్విజయ్ సింగ్ కు ఇదే విషయం చెప్పారు. దీంతో మాణిక్కం ఠాగూర్ ను తప్పిస్తే కానీ నేతల మధ్య సమన్వయం రాదని హైకమాండ్ కు డిగ్గీ రాజా చెప్పనట్టు సమా చారం. మరోవైపు మాణిక్కం ఠాగూర్ కూడా తెలంగాణ ఇంచార్జి బాధ్యతల నుంచి తప్పించా లని అధిష్టానాన్ని కోరినట్టు తెలుస్తోంది. సీనియర్ నేతలు తన మాట వినడం లేదని ఇప్పటికే ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఖర్గే, దిగ్విజయ్ సింగ్ కు ఠాగూర్ చెప్పినట్టు సమాచారం.

**తెలంగాణకు ఇంచార్జిగా సీనియర్ నేత**

ఠాగూర్ ను మారిస్తే ఆయన ప్లేస్ లో ఎవరు వస్తారనేది ఆసక్తిగా మారింది. దిగ్విజయ్ సింగ్ రాష్ట్ర ఇంచార్జిగా రావడం కష్టమేనని టాక్. ఉమ్మడి రాష్ట్రానికి ఇంచార్జికి ఉన్న ఆయన తెలంగాణకు మాత్రమే పరిమితం కావడాన్ని ఇష్టపడకపోవచ్చని సమాచారం. ఉత్తర భారతదేశానికి చెందిన ఇద్దరి పేర్లు అధిష్టానం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. తెలంగాణకు ఇంచార్జిగా సీనియర్ నేతనే పంపాలని అధిష్టానం ఫిక్స్ అయినట్లు కనిపిస్తోంది. హర్యానాకు చెందిన సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు రణదీప్ సుర్జేవాలా లేదా అదే రాష్ట్రానికి చెందిన సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు పన్నాలాల్ పునియా పేరు బలంగా వినిపిస్తోంది. సుర్జేవాలా ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రానికి ఇంచార్జిగా ఉన్నారు. వచ్చే ఏప్రిల్ లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇలాంటి సమయంలో ఆయన్ని అక్కడి నుంచి తప్పించి ఇక్కడికి వేస్తారా.. అనేది అనుమానమే.

**ముగ్గురు నేతల్లో ఎవరో ఒకరు ఇంచార్జిగా..**

ఇక దళిత సామాజిక వర్గానికి చెందిన పునియా యూపీ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా రిటైర్ అయ్యారు. రాజకీయాల్లోకి వచ్చి మంచి గుర్తింపు పొందారు. 2018లో చత్తీస్ గఢ్ ఎన్నికల సమయంలో ఇంచార్జిగా పనిచేశారు. చత్తీస్ గఢ్ లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని టాక్. పునియా కాదంటే.. మరో నేత పేరు కూడా వినిపిస్తోంది. మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చౌహాన్ పేరును కూడా అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ ముగ్గురు నేతల్లో ఎవర్నో ఒకరిని ఇంచార్జిగా నియమిస్తారని కాంగ్రెస్ లో టాక్ నడుస్తోంది.

## రెన్యూయెటబుల్ ఎనర్జీ ఉత్పత్తిలో తెలంగాణ గ్రేట్



హైదరాబాద్ : రెన్యూయెబుల్ ఎనర్జీ(పునరు త్పాధక విద్యుత్) ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం మరో గొప్ప ఘనత సాధించిందని టీఎస్ రెడ్కో చైర్మన్ వై.సతీష్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2వేల మెగావాట్ల టార్గెట్ ఇవ్వగా, ఈ ఏడాది వరకు తెలంగాణ 5078.73 మెగావాట్ల పునరుత్పాధక విద్యుత్ ను ఉత్పత్తి చేస్తోందని ఆయన చెప్పారు. కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికన్నా 254 శాతం అదనంగా పునరుత్పాధక విద్యుత్ ఉత్పత్తిని సాధించడం గర్వకారణంగా ఉందని బుధవారం ఆయన తెలిపారు. కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు ఇచ్చిన రెన్యూయెబుల్ ఎనర్జీ లక్ష్యాన్ని చేరుకోవడంలో బీజేపీ పాలిత రాష్ట్రాలే చతికిలబడ్డాయని ఆయన విమర్శించారు.

గుజరాత్ 108 శాతం, కర్నాటక 110 శాతం మాత్రమే అదనంగా ఉత్పత్తి చేయగా.. తెలంగాణ మాత్రం అద్భుతంగా పనిచేసి 254 శాతం అదనంగా ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర మాత్రం రెన్యూయెబుల్ ఎనర్జీ ఉత్పత్తిలో పూర్తిగా వెనకబడి ఉండిపోయాయన్నారు. ఫలితంగా దేశం.. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేక పోయిందన్నారు. తెలంగాణ మాత్రం దేశంలో కర్బన ఉద్గారాలు తగ్గించే లక్ష్యంతో.. ముందుకెళ్లుతోందని సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎలాంటి భేషజాలు లేకుండా తెలంగాణ ప్రభుత్వం దేశం కోసం పనిచేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ మార్గదర్శనంలోనే రాష్ట్రం ఈ ఘనత సాధించిందన్నారు. కేసీఆర్ విజన్‌తో తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్ వన్ గా నిలుస్తోందని, తెలంగాణ ఒక స్టార్టప్ స్టేట్ గా మారిందన్నారు. పునరుత్పాదక విద్యుత్‌లో మన రాష్ట్రం ఘనత సాధించడానికి మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల కృషి ఉందని ఆయన తెలిపారు.

# బీజేపీకి సిట్, బీఆర్ఎస్‌కు సీబీఐ అంటే భయమెందుకు..



హైదరాబాద్ : ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఆర్ఎస్, బీజేపీలను బాధితులుగానే చూపిస్తున్నారని, మరి ఈ కేసులో దోషి ఎవరని టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 2018 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపైన సీబీఐ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో కాంగ్రెస్ పార్టీ ఇంప్లీడ్ పిటిషన్ వేయాలా..? వద్దా%ా% అనేదానిపైన చర్చ జరుగుతోందని రేవంత్‌రెడ్డి వివరించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు టీఆర్ఎస్‌లో మంచి పదవులు ఇచ్చారని.. ఇది కూడా కరప్షన్ కిందనే విస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సీబీఐకి అప్పగించినందున తాము కూడా వినతిపత్రం ఇస్తామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నలుగురిలో ముగ్గురు పార్టీ మారినవారేనని తెలిపారు. ఈ కేసును రెండు కోణాల్లో చూడాలన్నారు. టీఆర్ఎస్, బీజేపీలను బాధితులను చూస్తున్నారని చెప్పారు. విచారణ పద్దతి అది కాదని రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నేరం జరిగింది.. కానీ విచారణ మేమే చేస్తామనడం ద్వారా టీఆర్ఎస్ లోపం బయటపడింది. నేరమే జరగలేదు అంటూనే సీబీఐ విచారణ అడగటం ద్వారా బీజేపీ లోపం బయటపడింది. సీబీఐ విచారణ అనగానే బీజేపీ, సిట్ విచారణ అనగానే టీఆర్ఎస్ ఎందుకు సంకలు గుద్దుకుంటున్నారు.' అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. రాజకీయ అవసరాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నాయని ఆయన మండిపడ్డారు.

**చైనాను ప్రశ్నించలేని స్థితిలో మోడీ సర్కార్..**

దేశం, రాష్ట్రం ప్రమాదంలో ఉన్నాయని, ఇలాంటి సమయంలో వ్యక్తిగత అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా కాంగ్రెస్ శ్రేణులు ప్రజల కోసం పోరాడాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గాంధీభవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాను రేవంత్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. మన భూభాగాన్ని చైనా ఆక్రమించుకుంటుంటే మోడీ సర్కార్ ప్రశ్నించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ హెచ్చరించినా.. దేశ భద్రత కేంద్రానికి పట్టడం లేదని ఆయన ధ్వజమెత్తారు. కుటుంబ సభ్యులకు దోచిపెట్టడానికి కేసీఆర్ దేశం మీద పడ్డారని ఆయన ఆరోపించారు. స్వాతంత్ర్య పూర్వపు పరిస్థితిలే ఇప్పుడు దేశంలో నెలకొన్నాయన్నారు.

బ్రిటీష్ విధానాలను దేశ ప్రజలపై రుద్దాలని బీజేపీ ప్రయత్నిస్తోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశానికి పొంచి ఉన్న ముప్పు నుంచి కాపాడేందుకు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తున్నరాని, మహాత్ముడి స్ఫూర్తితో ఆయన పాదయాత్ర కొనసాగిస్తున్నారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. రాహుల్ పాదయాత్ర భయంతోనే మోడీ కోవిడ్ రూల్స్ తీసుకొస్తున్నారని ఆయన విమర్శించారు.

**హాత్‌సేహాత్ జోడోలో పార్టీ శ్రేణులు పాల్గొనాలి..**

కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన హామీలపై కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు ఒత్తిడి తీసుకురావడంలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రమాదంలో ఉన్న దేశం, రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. జనవరి 26 నుంచి ప్రారంభమయ్యే హాత్ సే హాత్ జోడో యాత్రలో కాంగ్రెస్ శ్రేణులు అంతా పాల్గొని ప్రజల పక్షాన నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీ ఆవిర్భావ కార్యక్రమంలో టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, సంభాని చంద్రశేఖర్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

**గాంధీభవన్‌లో పీజేఆర్ వర్ధంతి..**

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పి. జనార్ధన్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని గాంధీభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీ పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్స్ మహేష్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, పి. విజయారెడ్డి, మెట్టు సాయికుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## పోలీస్ శాఖలో ఆక్సిలరీ ప్రమోషన్స్..

**ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ**



హైదరాబాద్ : పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన పలువురికి పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర డీజీపి మహేందర్రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటాపురం ఎస్సైగా పనిచేస్తున్న జి. తిరుపతికి ఇన్స్పెక్టర్‌గా, చర్ల పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తున్న అలెం రాజుకు ఇన్స్పెక్టర్ గా, రాజన్న జిల్లాలో డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ అహ్మద్ అలీషా కు ఎస్సైగా ప్రమోషన్ ఇచ్చారు.. ఇక.. భద్రాద్రి జిల్లాలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న మెరుగు రాజుకు ఎస్సైగా, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మహేందర్ రావుకు ఏ ఆర్ ఎస్ ఐగా, ములుగులో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్. రమేష్ కు హెడ్ కానిస్టేబుల్ గా, ఏ ఆర్ పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ఫరీదోద్దీన్, రాజ్ కుమార్ లకు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# సిరిసిల్ల రాజేశ్వరి జీవితం అందరికీ ఆదర్శం: కేటీఆర్




హైదరాబాద్ : సిరిసిల్ల రాజేశ్వరి మరణం పట్ల మంత్రి కేటీఆర్ సంతాపం తెలిపారు. నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించిన రాజేశ్వరి, తన వైకల్యాలను జయించి ఆత్మవిశ్వాసంతో కాళ్లనే చేతులుగా మల్చుకొని, అక్షరాలు నేర్చుకుని కవితలు రాసిన తీరు అద్భుతమని కేటీఆర్ అన్నారు. శరీరానికే వైకల్యం కానీ, ఆలోచనకి, ఆశయానికి కాదని, రాజేశ్వరి తన మనోధైర్యంతో నిరూపించిందన్నారు. ఆమె స్ఫూర్తివంతమైన జీవన ప్రయాణం ఎంతోమందికి ఆదర్శమని రాజేశ్వరి ఆత్మకి శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**సిరిసిల్ల రాజేశ్వరి గురించి.....**

నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించిన రాజేశ్వరి జీవితాన్ని వైకల్యం చిన్నాభిన్నం చేసింది. ఎక్కడ చెదరని గుందేనిబ్బరం తో కాళ్ల ను చేతులుగా మలచుకుని తన ఆత్మవిశ్వాసాన్ని అక్షరాలుగా నిలబెట్టి ఎన్నో కవితలు రాశారు. చెదరని ఆత్మవిశ్వాసంతో రాజేశ్వరి ఎన్నో కవితలు.రాశారు."సంకల్పం ముందు వైకల్యం ఎంత! ధృడ చిత్తం ముందు దురదృష్టం ఎంత! ఎదురీత ముందు విధిరాత ఎంత. పోరాటం ముందు ఆరాటం ఎంత.రాజేశ్వరి రాసిన కవిత ను గమనిస్తే ఆమె అక్షరాల పదును అర్థమవుతుంది. రాజేశ్వరి రాసిన కవితలను సుద్దాల ఫౌండేషన్ సిరిసిల్ల రాజేశ్వరి కవితలు పేరుతో కవిత సంకలనాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. 2014 లో వచ్చిన ఈ కవిత సంకలనానికి జీవితమే కవిత్వం అంటూ ముందుమాట రాస్తూ డాక్టర్ శీలాలోలిత చివర్లో చెప్పిన మాటలు "బతుకుతున్నాం బాధపడుతున్నం అంతవరకే కానీ అమె మాత్రం జీవిస్తుంది అనుభవిస్తుంది. అనుభవాల నుంచి వచ్చింది రాజేశ్వరి కవిత్వం. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రాజేశ్వరి చివరకు తుదిశ్వాస విడిచారు. సిరిసిల్ల ప్రాంతం నుంచి వైకల్యాన్ని సైతం ధిక్కరించి ఆత్మవిశ్వాసపు అక్షరాలను కవిత్వంలో ఆవిష్కరించిన సిరిసిల్ల రాజేశ్వరి ఇక లేరు. రాజేశ్వరికి వినమ్రంగా కన్నీటి నివాళులు.

## ఎమ్మెల్యేల ఎర కేసు.. హైకోర్టు జడ్జిమెంట్‌తో టేకోవర్ చేసిన సీబీఐ

హైదరాబాద్ : ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం ముమ్మాటికీ తప్పేనని హైకోర్టు పేర్కొంది. కేసుకు సంబంధించి 45 అంశాలను బేస్ చేసుకుని సీబీఐకి కేసు అప్పగించినట్టు జడ్జిమెంట్‌లో పేర్కొంది. కాగా, ఈ కేసు జడ్జిమెంట్ కాపీ ఇవ్వాల సీబీఐకి అందింది. దీంతో ఈ కేసును సిట్ నుంచి సీబీఐ టేకోవర్ చేస్తున్నట్టు ప్రకటించింది. ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించి ఫామ్ హౌస్ ఎఫ్ఐర్ ప్రకారమే సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నట్టు తెలుస్తోంది. ఇక.. ఈ కేసుకు సంబంధించి పలు కీలకాంశాలను హైకోర్టు జడ్జి ప్రస్తావించినట్టు తెలుస్తోంది. సీఎం కేసీఆర్ కోర్టుకు గోప్యంగా అందజేయాల్సిన డాక్యుమెంట్లను పబ్లిక్ చేశారని తీర్పులో కోడ్ చేసినట్టు తెలుస్తోంది. సీఎం ప్రెస్ మీట్‌ని కూడా కోడ్ చేస్తూ తీర్పు ఆర్డర్‌లో పేర్కొన్నట్టు సమాచారం. దీంతోపాటు సిట్ ఎంక్వైరీపై కూడా హైకోర్టు పలు ప్రశ్నలను లేవనెత్తిందని, సిట్ ఉనికినే ప్రశ్నించినట్టు తెలుస్తోంది.



Edited, Printed, Published & Owned by Sri N.C. Shekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :N.C.Shekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com